క్లుప్తంగా

వేడుకగా అయ్యప్ప స్వాముల ఇరుముడి


ఇరుముడి కడుతున్న గురుస్వామి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, నాగంపల్లి గ్రామాలకు చెందిన పలువురు అయ్యప్ప మాలధారణ స్వాములు శనివారం ఇరుముడి ధరించి శబరిమల తరలివెళ్లారు. ముందుగా గొట్లగట్టు గ్రామంలో 20 మంది మాలధారులు గ్రామంలో అయ్యప్పస్వామి చిత్రపటంతో ఉత్సవం నిర్వహించారు. ఇరుముడి కార్యక్రమానికి అయ్యప్పల బంధుమిత్రుల రాకతో స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో సందడి నెలకొంది.

నేడు గాయత్రి యజ్ఞం

గిద్దలూరు రూరల్: పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కాశినాయన కుంట ఆవరణలో గల గాయత్రిమాత ఆలయంలో ఆదివారం గాయత్రి యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శనివారం ఓ ప్రకటనలో కోరారు.

నేడు దత్త కళ్యాణ మహోత్సవం

బేస్తవారిపేట: దత్త జయంతి సందర్భంగా స్థానిక నెహ్రూబజార్‌లోని సాయి నిలయంలో ఆదివారం కళ్యాణం నిర్వహిస్తున్నట్లు దత్త సాయి భరద్వాజ్ భక్త బృంద సభ్యులు తెలిపారు. ఉదయం బాబాకు కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, గురు చరిత్ర పారాయణం, అనఘాలక్ష్మి సమేత దత్తాత్రేయ స్వామి కళ్యాణం, మధ్యాహ్నం అన్న సంతర్పణ చేయనున్నట్లు వివరించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలి కొండ తిరుమలనాథస్వామి దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీ ప్రసాద్ స్వామి, అమ్మవారికి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కలగాలని ఆలయం వెనకాల ఉన్న గిరికొండ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దిగుబడిపైనే ఆశలు

- సబ్‌డివిజన్‌లో 3,460 హెక్టార్లలో పప్పుశనగ సాగు
- మార్కాపురం, కంభం మండలాల్లో అత్యధికం
- రబ్బరు పురుగును నివారించుకోవాలని వ్యవసాయాధికారుల సూచన

మార్కాపురం:

రబీ సీజన్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే శనగ పంట సాగుపై మార్కాపురం డివిజన్‌లోని రైతులు ఆసక్తి చూపారు. గత ఏడాది క్వింటా శనగలకు సుమారు 5,500 రూపాయలు ధర లభించడంతో ఈ ఏడాది కూడా రైతులు శనగ సాగుపై దృష్టిపెట్టారు. మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మార్కాపురం, తర్లుపాడు, కంభం, అర్ధవీడు, పెద్దారవీడు మండలాల్లో 3,460 హెక్టార్లలో శనగ సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నారు. మార్కాపురం మండలంలో తిప్పాయపాలెం, భూపతిపల్లి, నికరంపల్లి, మిట్టమీదిపల్లి, తర్లుపాడు మండలంలో సీతానాగులవరం, మీర్జపేట, తర్లుపాడు తదితర గ్రామాల్లో, పెద్దారవీడు మండలంలోని పెద్దారవీడు, గొబ్బూరు, బి చెర్లోపల్లి తదితర గ్రామాల్లో శనగ అధికంగా సాగైంది. ఇదిలా ఉండగా గతేడాది ఎకరాకు సుమారు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు శనగ దిగుబడి వచ్చింది. ఈ నేపథ్యంలో పలువురు రైతులు ఈ ఏడాది జేజీ 11 రకం శనగ ఎక్కువగా సాగుచేశారు. ఇప్పటి వరకు ఎకరాకు 15 వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు పంటను కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు. రబ్బరు పురుగు ఆశిస్తుండటంతో శనగ దిగుబడిపై రైతులు కొంత ఆందోళన చెందుతున్నారు.


మార్కాపురం ప్రాంతంలో సాగు చేసిన శనగ

మండలం	సాగుచేసిన విస్తీర్ణం (హెక్టార్లలో)
మార్కాపురం	837.71
తర్లుపాడు	603.4
కంభం	1194.33
అర్ధవీడు	796
పెద్దారవీడు	28.73
మొత్తం	3,460.17

ప్రస్తుతానికి పంట బాగుంది



సుమారు 5 ఎకరాల్లో పప్పుశనగ సాగుచేశా. ఇప్పటి వరకు పంట పర్వాలేదు. ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని అనుకుంటున్నాం. అయితే అక్కడక్కడా రబ్బరు పురుగు కనిపిస్తోంది. పురుగు ఉధృతి ఎక్కువైతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. వ్యవసాయాధికారుల సలహా మేరకునివారణచర్యలు చేపడతాం.
– బి.సుబ్బారెడ్డి, మిట్టమీదిపల్లి

దిగుబడి వస్తుందనుకుంటున్నాం



పోయిన సంవత్సరం పప్పుశనగ దిగుబడి బాగుంది. ఈ సంవత్సరం కూడా మంచి గిట్టుబాటు ధర ఉంటుందని అనుకుంటున్నా. దిగుబడి కూడా ఎకరాకు 10 క్వింటాళ్లపైనే రావచ్చని ఆశిస్తున్నాం. మంచు ఎక్కువగా ఉంటే పంట బాగుంటుంది.
– టి పెద్దకాశయ్య, బొందలపాడు

రబ్బరు పురుగు నివారించుకోవాలి



శనగ పంటలో అక్కడక్కడా పొగాకు లద్దెపురుగు(రబ్బరు పురుగు) ఉంది. దీని నివారణకు ఇమామెక్టిమ్ బెంజోయేట్ ఎకరాకు 100 గ్రాములు పిచికారీ చేసుకోవాలి. ఎక్కడైనా తెగుళ్లు వస్తే వెంటనే సమీపంలో ఉన్న వ్యవసాయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్తే నివారణ చర్యలు చేపడతాం. విచ్చలవిడిగా పురుగుమందులు వాడవద్దు.
– దేవిరెడ్డి శ్రీనివాసులు, ఏఓ, మార్కాపురం

సాగునీటి సంఘాల ఎన్నికలో తొండాట

- టీడీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించిన అధికార యంత్రాంగం
- ఇతరులకు నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలయాపన
- పలు గ్రామాల్లో పత్తా లేని వీఆర్వోలు..
- రైతుల విజ్ఞప్తులపై స్పందించని తహసీల్దార్లు

మార్కాపురం రూరల్: అధికారపార్టీ నేతలు చెప్పినట్టుగా అధికారులు తలాడించారు. నీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించినట్లు వైఎస్సార్ సీపీ స్పష్టమైన ప్రకటన చేసినా.. గెలుపుపై నమ్మకం లేని టీడీపీ నేతలు అడ్డదారులు తొక్కారు. అధికారులను, పోలీసులను అడ్డుపెట్టి తొండాట ఆడినట్లు పెద్ద ఎత్తున విమర్శలొస్తున్నాయి.

☛ మార్కాపురం మండలంలో రైతులకు నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులపై అధికార టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు నో డ్యూ సర్టిఫికెట్ల కోసం కొండేపల్లి, పెద్దనాగులవరం తదితర గ్రామాల రైతులు రెవిన్యూ సిబ్బంది చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఆసక్తి ఉన్న రైతులు నీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేయలేకపోవడంతో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భూపతిపల్లి, మార్కాపురం 1, మార్కాపురం 2, పెద్దనాగులవరం, తిప్పాయపాలెం, పెద్దయాచవరం, శివరాంపురం, వేములకోట నీటి సంఘాల అద్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు అధికారులు తెలిపారు.

తర్లుపాడు: మండలంలో నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికల్లో అధికారులు స్వామి భక్తిని ప్రదర్శించారు. పోటీ చేసే అభ్యర్థులకు నో డ్యూ సర్టిఫికెట్లు అందించకపోగా అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఇళ్లకు వెళ్లి అదే సర్టిఫికెట్లు పంపిణీ చేసిన తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గెలిచేందుకు అవకాశాలు ఉన్నప్పటికీ అధికారుల తొండాటతో తాము ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కోల్పోయినట్లు పలు గ్రామాల రైతులు విచారం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాల్సిన ఎన్నికల్లో అధికార టీడీపీ నేతలు అడ్డగోలుగా వ్యవహరించారని విమర్శించారు. మండలంలోని నాలుగు సాగు నీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు.

కొనకనమిట్ల: మండలంలోని ఆరు గ్రామాల్లో సాగు నీటి సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. నో డ్యూ సర్టిఫికెట్లను ఇతర రైతులకు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి చేయడంతో వారికి అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి.

పొదిలి రూరల్: మండలంలోని రామాపురం, తీగదుర్తిపాడు, ఏలూరు, పొదిలి పెద్ద చెరువు, చిన్న చెరువు సాగు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎలక్షన్ ఆఫీసర్, వ్యవసాయాధికారి ఎస్‌కే జైనులాబ్దిన్ తెలిపారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని వెల్లుపల్లె, ముండ్లపాడు, బురుజుపల్లె, తాళ్లపల్లె, ఉయ్యాలవాడ, సంజీవరాయుడుపేట, చట్టిరెడ్డిపల్లె, వెంకటాపురం, నల్లగట్ల, అంబవరం, ఉప్పలపాడు, గడికోట, కంచిపల్లె గ్రామాల్లో నీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు.

నిబంధనలకు నీళ్లొదిలారు


నెమలిదిన్నె చెన్నారెడ్డి

కంభం: నీటి సంఘం ఎన్నికలను అధికారులు ఏకపక్షంగా నిర్వహించారని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నీటి సంఘం ఎన్నికలపై రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదన్నారు. గ్రామాల్లో టాంటాం వేయించడం, అవగాహన కల్పించకపోవడంతో ఎన్నికలు ఉన్నాయన్న విషయం కూడా చాలా మందికి తెలియలేదన్నారు. అధికారపార్టీ నాయకుల సూచనల ప్రకారం నడుచుకున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఈ ఎన్నికల్లో నామినేషన్ వేయడం కోసం రైతులకు నో డ్యూ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎన్నికలు నిర్వహించారని అసహనం వ్యక్తం చేశారు.


నీళ్ల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ నగేష్, పక్కన మహిళలు

నీటి సమస్యపై మహిళల ఆందోళన

- అధికారుల తీరుపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నిరసన

మార్కాపురం: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని 27వ బ్లాక్‌లో బోరుచెడిపోయి మూడు నెలలైందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్, వార్డు మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ స్థానిక వివేకానంద స్కూల్ వద్ద డీప్‌బోరు మరమ్మత్తులకు గురై మూడు నెలలైందని సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనరు, ఏఈ తదితరులకు చెప్పినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తమపై ఎందుకింత వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. అధికారులు రెండు లేదా మూడు రోజుల్లో పరిష్కరించకపోతే వార్డు ప్రజలందరితో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ భూపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆ వార్డులో బోరు ఏర్పాటు కోసం కౌన్సిల్‌లో తీర్మానం పెట్టామని వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

చేయూత ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కంభం బాలికల హైస్కూల్, తర్లుపాడు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు బేస్తవారిపేటకు చెందిన చేయూత మిత్రమండలి ఆధ్వర్యంలో శనివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 370 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 29న మొదటి, రెండో, మూడో బహుమతులుగా వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.నబీ, ఎం.వెంకటేశ్వరరెడ్డి, రవీంద్ర, ప్రసాద్, రామమోహన్‌రావు, సుబ్రహ్మణ్యం, రామచంద్ర, ఖాశింవలి పాల్గొన్నారు.


ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

తర్లుపాడు: స్థానిక జెడ్పీపాఠశాలలో శనివారం నిర్వహించిన టాలెంట్ టెస్టుకు 155 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు దూదేకుల నబీ తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామన్నారు.

కమనీయం.. రంగనాయకుని కల్యాణం


శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాచర్ల: వేదమంత్రాల సాక్షిగా మంగళవాయిద్యాల నడుమ ముక్కోటి దేవతల దీవెనలతో నెమలిగుండ్లరంగనాయకస్వామి కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అడవుల్లో వెలసిన నెమలిగుండ్లరంగనాయకస్వామి దేవస్థానం ప్రాంగణంలో రంగనాయకస్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణాన్ని తిలకించి భక్తులు పరవశించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్‌తో పాటు ఉభయదాతలు ఒక్కొక్కరు రూ.1,516 చెల్లించి స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.


స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న ఉభయదాతలు

వైభవంగా లక్ష్మీచెన్నకేశవుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి శాంతి కల్యాణాన్ని అర్చకులు శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. చెన్నకేశవ స్వామివారి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయాల్లో భక్తుల సందడి


తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొనకనమిట్ల: మార్గశిర మాసాన్ని పురస్కరించుకొని వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెలుగొండ వెంకటేశ్వరస్వామి వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.